# ఇల్లాలి జాలిగీతి

వాన కురుస్తున్నది జడివానకురుస్తున్నది. గాలివీస్తు న్నది! హోరుగాలివీస్తున్నది.

దారి కనిపించడం లేదు చేతిలోని గొడుగు నిలబడటం లేదు. అడుగులు ముందుకు పడటంలేదు. జోరుజోరుగా వాన కురుస్తున్నది. కాలికున్నది స్లిప్పరు జోడు. పిక్కవరకూ చీర నంతా ఖరాబు చేస్తున్నది. మూడుఫర్లాంగులు నడవాలి. బస్సు రావడంలేదు వచ్చినా సీటుదొరకదు, గుండెల్లో గుబులు పేరు కుంటున్నది. ఇంటివద్ద పిల్లలు పేక్కుతినే అత్తగారు, ఆస్పత్రిలో ఆయన...మన ధ్యాసలేదు. మగత స్మృతి రావడం అంతే కళ్ళు తెరవడం అదీ ఎన్నాళ్ళకొకసారో!...

సుశీల నడుస్తున్నది. వానజల్లులాంటి ఆలోచనలు... భారంగా ఈదుతూ నడుస్తూన్నది.

ఆయనకి నాలుగు నెలల నుంచి ఒక్కటే జబ్బు. నాలుగు పెద్ద ఆస్పత్రులు మాత్రం మారడం రకరకాల డాక్టర్లు... రకరకాల పరీక్షలన్నీ పూర్తి చేయడం జరిగింది. జబ్బు నిర్ణయం మాత్రం జరుగలేదు. మొదట్లో దానిని టి. బి. అన్నారు. శానిటోరియంలో రెండు నెలలుంచారు. అన్ని పరీక్షలు చేసారు. టి. బి. కాదన్నారు ఏమిటో తెలియదన్నారు. మళ్ళీ జనరల్ హాస్పిటల్ పరీక్షలు ... కాదు మెంటల్ హాస్పిటల్‌కి పొమ్మన్నారు. నెల్లాళ్ళుంచారు. ఆఖరికి—మెంటల్ హాస్పిటల్‌కీ ఉన్న జబ్బుకీ సంబంధం లేనట్లు తేల్చారు. ఇప్పుడు మళ్ళీ జనరల్ హాస్పిటల్!

హైదరాబాద్ నగరంలో జబ్బు మనిషిని రక్షించుకోంటూ బ్రతకడం బ్రతుకు దుర్భర మవుతున్నది. వంటి మీదున్న నగలు ఒకటొకటే అంగళ్ళకు చేరుకుంటున్నాయి. కొడుకు చావుబ్రతుకుల్లో ఉన్నాడన్న ధ్యాసేలేని తల్లి... కొడుకుమీదున్న మమతకన్న—కోడలిపై కార్పణ్యాం తీర్చుకోవడమే ఆమెకు ప్రధానమైపోతోంది, ఒక్కగానొక్క కొడుకు!

ఆలోచనల బరువుతో, జ్ఞాపకాల వ్యధలతో, కర్తవ్యాల కఠోర తపస్సుతో, మోకాలి బంటి నీటిలోంచి ఈదుతూ నడుస్తున్నది సుశీల. ఎదురు తెన్నులు కనిపించడం లేదు. జడిపాన వదలడంలేదు. మసక మసక ఆలోచనల తెరలు

తొలగడంలేదు. ఎట్టఎదుట సడెన్ బ్రేకుతో ఆగి, హారను మోగిస్తున్న కారు! అధికారుల అందమైనకారు! ఒక్క త్రుటి కాలంలో ఆమె ప్రాణాన్ని హరించే ఉండేది! అదృష్టవంతు రాలు! మాటలు విన్న సుశీల ఫక్కున నవ్వాలనుకున్నది.

అవునవును అంతా అదృష్టమే!—పేవు మెంటు మీద కెక్కుతూ అనుకున్నది సుశీల. చీర మోకాలివరకూ తడిసి నీరు కారుతున్నది. ఆమెకనులు కన్నీటిని మరచిపోయి చాలా కాలమైంది. కనుకనే చీరకుచ్చెళ్ళు ఏకధారగా ఏడుస్తున్నాయి. రోజూ రాత్రి యింటికి చేరుకునేముందు కన్నీరువస్తే కొంత బరువైనా తగ్గునేమో అనుకునేది సుశీల. ఇంటెడు చాకిరీ తానే చేసుకోవాలి. ఆస్పత్రికి మూడుపూటలూపోయి భర్త యోగ క్షేమాలు తెల్సుకోవాలి. ఆప్యాయత వొలకబోస్తున్నట్లు పలకరించే నర్సులకు తాను కరచాలనం చేస్తున్నట్లు నటించి ముడుపులు అందించాలి. లోకమంతా నటన! భర్త...పిల్లలు అన్నీ నటన!! అవును...తన బ్రతుకే నటన...ఇన్ని బాధలు పడవలసిన పాత్రను విధి తనకి ప్రత్యేకిస్తే యిలా జరక్క ఎలా తప్పుతుంది?!...

'ఏమమ్మా! నిన్ను విశ్వనాథం బావకిచ్చి పెండ్లి చేదా మనుకున్నానమ్మా!. నీ వుద్దేశం ఏంటిటి?' అని నాన్నగారు అడిగినప్పుడు—తాను స్పష్టంగానే చెప్పింది. నాన్నగారు సర్కిలు యినస్పెక్టరు: సర్కిలంతా గడగడలాడేది. ఐనా

తాను నిర్భయంగానే చెప్పగలిగింది...నాన్నగారిదగ్గర తనకీ చనువున్నట నిజమే. కాని పెండ్లి విషయంలో తనకు స్వేచ్ఛ నిచ్చేందుకు ఆయన చనువు అంగీకరించలేదు.

'ఏదో కుర్రది! దానికేం తెలుసు?' అనుకున్నారు నాన్నగారు. వారం రోజులు ఏకధాటిగా ఏడ్చింది తాను. అమ్మతో మొత్తుకుని చెప్పింది. మందలించిన అక్కతో కొట్లాడింది ఏమైతేనేం లోకం తన్ను ఒంటరిదాన్ని చేసింది బోనులోనిలవేసింది. అగ్నిహోత్రం ముందు మూడుముళ్ళూ వేయించింది విశ్వనాథంచేత.

'ఏం తప్పినా మేనరికం తప్పుతుందటమ్మా? నాకు ఒక్కగాని ఒక్క ఆడబడుచు...దానికి లేకలేక ఒక్కకొడుకు! దాని ముద్దూ ముచ్చటా తీర్చవద్దుటమా?'

నాన్నగారి అనుశాసనం తన్ని నటనకు అప్పగించింది!

అవును. ఎవరి ముద్దూ ముచ్చటా తీర్చడానికో తన బ్రతుకు ఇంధనంగా మార్చింది. ఎవరి ఆనందంకోసమో, కొత్త బట్టవంటి తన బ్రతుకు ముండ్లకంచెపై ఆరేసింది సుశీల. కాని తాను అప్రయోజకురాలు నటించడం చేతకాని, తన గొంతులో వేరొకరి మాటల్ని శృతికల్పి ధ్వనించలేని వట్టి చచ్చుపీనుగ! కనుకనే తనకీ శిక్ష! 'ఏ నేరానికీ శిక్ష?' ఉక్రోషంతో ప్రశ్నించుకొంది సుశీల. గుండె గుబగుబలాడింది గొంతు ముడివడ్డది. కాళ్ళు అనాశక్తంగా ఆసుపత్రి గేటులోకి

మలుపు తిరిగాయి. వాన చినుకులు వేగం తగ్గించుకున్నాయి. ఆస్పత్రి ఆవరణలో తలలెత్తుతున్న పూవులు వానదెబ్బకి అనాకారంగా తయారయ్యాయి.

మేలువార్డులోంచి నర్సు వస్తున్నది. తానంటే ఎంతో ప్రేమించే నర్సు. సానుభూతి కురిపించే కృపాపక్టోరియాయే వస్తున్నది,

'ఏం సుశీలమ్మా? ఆలస్యమైంది!' చలాకీగా ప్రశ్నించింది

'వాన... తెరిపి లేదు... ఎలా ఉన్నది?'

తెలివి వచ్చిందమ్మా! ఇంకా ఆక్సిజను యిస్తున్నాం. మీ తమ్ముడున్నాడుగా!'

'ఆఁ... నిజమా?'

ఒక్క అంగలో సుశీల మేల్ వార్డులో ప్రవేశించింది. మంచాల లెక్క తన పాదాలకి తెలుసు. గబగబా చేరుకుంది. విశ్వనాథం చూస్తున్నాడు. ఆదుర్దాగా సుశీల ఆయననుదుటి మీద చేయి వేసింది.

'ఎలా వుంది?'

చిరునవ్వు నవ్వాడాయన

ఆ నవ్వు తుఫాను తగ్గిననాటి సూర్యోదయం! అవును, ఆ నవ్వు రెండు నెలల కటిక చీకటి తర్వాత చంద్రోదయం. ఆ నవ్వు బ్రతుకు చీకటి గుహలో వెలిగిన శమంతకమణి దీపం!

ఆమె హృదయం పులకరించింది.

'హార్లిక్సు పుచ్చుకుంటారా ?'

మళ్ళీ చిరునవ్వు. ఆయనకన్నులింత పెద్దకన్నులని ఆమె కిదివరకు తెలియదు ఆ చూపులలో ఎంత ఆప్యాయత! తన్ను చూడ్డానికే కళ్ళు తెరచుకొన్నట్లు ఎంత మమకారం! సంచి లోని ప్లాస్కుతీసి, గాజుగ్లాసులో కొద్దిగా పోసింది. మెల్లగా పెదవుల కందించింది సుశీల. సరిగ్గా రెండవున్నుల హార్లిక్సు త్రాగారాయన. మళ్ళీచిరునవ్వు నవ్వారు మళ్ళీకళ్ళుమూశారు.

ప్రక్కనే నుంచున్న మేల్నర్సు కళ్ళు కదిలాయి 'మళ్లీ స్మారకం తప్పిందండీ!'

'తెలివొచ్చి గంటయిందక్కా! ఏదో మాట్లాడాలని ప్రయత్నించాడు కూడా; సరిగ్గా తెలియలేదు. బహుశా నీ గురించే అడిగాడేమో!' అన్నాడు తమ్ముడు సూర్యం;

ఈమాటకు సుశీలకు నిజంగానే కన్నీళ్ళు వచ్చాయి. వానలా కురిసాయి. వెల్లువలా పొంగాయి. వెనుక నుంచి మెల్లగా వచ్చిన వచ్చిన కృప చేతులు ఆమె కపోలాల్ని చల్లగా తాకాయి, గబగబాలేచి కళ్ళు తుడుచుకుంది సుశీల. చీరచెంగునుండి నీళ్ళు కారుతూనే ఉన్నాయి.

గొంతుసవరించుకున్నది 'తమ్ముడూ నీవు భోంచేసి రా నాయనా!'

తమ్ముడు లేచాడు, బయల్దేరాడు; తనూ లేచింది ప్రక్కనేఉన్న నర్సు గదిలోకివెళ్ళింది. సంచిలోంచి చీరమడత

తీసి కట్టుకున్నది. కొత్తచీర తడవలేదు. చల్లగా ఉంది. నీళ్ళు కారుతున్నచీరవిప్పగానే గుండె కుదుటపడ్డట్టయింది. గదిలోంచి బయటకు వద్దామనుకుంటున్నది. సరిగ్గా అదే సమయానికి కృప చేతిలో ఒక కవరుతో వచ్చింది.

'ఇదిగోనమ్మా—సుశీలా! ఉత్తరం వచ్చింది'

ఉత్తరం వచ్చింది. ఆమాట వినగానే గుండె కలుక్కు-మన్నది. ఎన్నాళ్ళకెన్నాళ్ళకి! అప్పుడే యిరవైరోజులైందేమో! రోజూ అడుగుతూనే ఉన్నది తను. ఈనాడింకా అడగలేదు. ఆయనకి మెలకువరావడం, మళ్లీ మూర్ఛకమ్మడం తన్ను నిశ్చేతనంగా మార్చింది.

కవరు జాగ్రత్తగా విప్పింది. పెద్ద ఉత్తరమది — పద్నాలుగు పేజీలు లేఖ! దానితో పాటు ఉత్తరాల మడతలో ఒక పచ్చకాగితంకూడా ఉన్నది. దాన్నిచూడగానే తనకు చేతులు వణికాయి. గుండె కొట్టుకుంటున్నది. యెందుకిలా కంగారు పడుతున్నది? తాను పడుతున్న అవస్థలగురించి అతనికి తెలియ పరచిందికాదా? అయితేమాత్రం తనకు డబ్బు పంపడమేమిటి? అందునా తప్పుదారినా? తను నిస్సహాయ స్థితిలో ఉన్నదే అనుకో డబ్బు పంపమని కోరలేదే? ఎందుకిలా తన్ను అవమానపరచడం? అవమానం కాదా మరి! కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. కంఠం ముడివేసినట్టయింది. మనసులో ఏవో తెరలు వ్రేలుతున్నాయి. ఉత్తరం మడతవిప్పి చదువుతూన్నది.

సుశీల కన్నులు— ఏవో అద్భుత దృశ్యాలను చూస్తున్నట్లు సౌమనస్యంతో నిండిపోయాయి. అశ్రువు లెండిపోయాయి హృదయం గాలిపటంలా పల్టీలు కొడుతున్నది. లేఖ... హృదయ సానువులలో విద్యుత్కాంతులు వెలార్చుతున్నది. మహిమాన్విత జీవనసంగీతాలు వినిపిస్తూన్నది. కనుకనే తన మనసు పావురాయిపిట్ట!

ఆయన చావుబ్రతుకుల్లో ఉన్నారు. రోగం ఏమిటో పోల్చుకోలేకుండా వున్నారు డాక్టర్లు. ఆయన...తన పిల్లలకు తండ్రి!... తనకు భర్త! — కాని ఆవిషయం తానెప్పుడూ హృదయపూర్వకంగా అంగీకరించలేదు. పరిస్థితుల బలవంతంపై ఆయనను తాను భర్తగా అంగీకరించింది. అంగీకారం, కాదు బలాత్కారం! అవును బలాత్కారంగానే ఆయన భర్తృత్వానికి ఒడబడింది తాను. బలాత్కారంగానే తనపిల్లల కాయన తండ్రి అయ్యారు. అంతా నటన! లోకంకోసం; తన ప్రవర్తన పట్ల అసమ్మతితో 'అవమానంతో కుంగిపోతున్న' తలిదండ్రుల సంతృప్తికోసం, అంతా నటన!

సుశీల ఉత్తరం చదువుతూన్నది. ఆమె హృదయం పరవళ్ళు త్రొక్కుతూన్నది.

సుదర్శనం లేఖలు కవిత్వపు గుళికలు...లేఖనిండా విశ్వనాథం సుస్త్రీపట్ల గాఢసంతాపమే వ్యక్తమైంది. అతని హృదయం అంత నవనీతం మరి! విశ్వనాథంపట్ల సుదర్శనానికి

ఈర్ష్య లేదు. విశ్వనాథం ఎంత మేనత్త కొడుకైనా ఆమె హృదయంలో తొలుదొల్త ప్రవేశించినది సుదర్శనమే! ఎప్పుడో పసితనంలో పదహారేళ్ళ క్రితం— తన పదహారో యేట తాను కథలు వ్రాస్తున్న రోజుల్లో, తన కంఠంలో సంగీతం సెలయేరులా ప్రవహిస్తున్న రోజుల్లో అతని స్నేహాన్ని అన్వేషించుకున్నది తాను. అప్పటికే అతని కథలు గేయాలు పత్రికల్లో పడుతున్నాయి. అప్పటికే అతను, నూత్న యవ్వనంలోనే విరహగీతాలు వ్రాస్తున్నాడు. తాను వెళ్ళింది. తన కథలు చూపించింది. సుదర్శనం ఆశ్చర్యపోయాడు. ఎంతో మెచ్చుకున్నాడు. కావలసిన సవరణలు చేసి అచ్చు వేయించాడు. తన స్వంత పేరున ప్రకటించవద్దన్నది సుశీల. ఇద్దరూ ఆలోచించి కళ్యాణసుందరి అనే మారుపేరు ఎన్నిక చేశారు. తన కథలుకూడా ప్రచురితమవుతూ వచ్చాయి...

ఉత్తరం చదువుతూనే ఉన్నది కాని పాతజ్ఞాపకాలను అరికట్ట లేకపోతున్నది సుశీల... 'ప్రాణేశ్వరీ, మనమిరువురం పసితనం నుంచీ కలిసి కన్న కలలు, కార్చిన కన్నీరు, కలిసిచేసిన తపస్సు ఫలించి ఉన్నట్లయితే— ఈ బాధలు లేకపోవునుగదా! అయినా ఇన్ని బాధలు పడవలసి ఉండగా— విధి మరోలా ఎందుకు శాసిస్తుంది చెప్పు! అన్న వాక్యంచదివేసరికి సుశీల హృదయం విషాదమేఘంతో నిండిపోయింది. తన ప్రియుని సౌజన్యం తన సర్వస్వాన్నీ కదిపివేసింది.

నిజమే, సుదర్శనాన్ని పెళ్ళిచేసుకుందుకు తానెంత తీవ్రంగా పోరాడలేదు. త్రికరణశుద్ధిగా ప్రయత్నించలేదు? కాని, దిక్కుమాలిన శాఖాభేదాలు చూపించి, నిస్సహాయంగా తనమీద, మావయ్యగారు పోలీసు హోదా యావత్తూ ప్రదర్శించి, దండించి, మేనరికం తప్పదంటూ బలాత్కారంగా వివాహం చేశారు.

అంతే! దానితో తడవతడవకూ బలాత్కారమే! బ్రతుకే దుస్సహం కాగా తాను విశ్వనాథంతో కాపురం చేసింది. ఎలాచేసినా కాపురం కాపురమే అనాలి కనక, ముగ్గురు పిల్లల్ని కూడా కన్నది...కాని సుదర్శనాన్ని మరచిపో గలిగిందా తను? తన మనసులో దాచుకున్న ప్రేమగురించి అమ్మకీ నాన్నకీ చూచాయగా తెలిసినపుడు వాళ్ళు నిగ్గతీసి అడిగినపుడు, అక్క నోటికిరాని తిట్లు తిట్టినపుడు, తాను స్పష్టంగానే చెప్పింది. 'బలవంతంగా విశ్వనాథంబావతో నాకు పెళ్లి చేసి బలాత్కారంగా నన్ను గదిలోకితోసి అతనికి నాపై సర్వాధికారాలను ధారాదత్తంచేసి, నాచేత మీరే బలవంతంగ వ్యభిచారం చేయించారు! అని స్పష్టంగానే అనేసింది తాను.

ఉత్తరం పూర్తిచేయనేలేదు. ఇంతలోకే తమ్ముడు సూర్యం రావడం గమనించింది. సూర్యానికి ఈ వ్యవహారం తెలుసు. అసలు బంధువుల్లో తెలియనిదెవరికి? కాని— ఆసుపత్రిలో ఆయన చావు బ్రతుకుల్లో ఉండగా తాను ప్రేమలేఖ

చదువుతూ ఉండటం లోకం దృష్టిలోనైనా పాపం అనిపించింది తనకి. ఉత్తరం ముడిచి కవరులో పెట్టింది. పచ్చకాగితంకూడా కవరులోనే పెట్టింది. కవరు సంచిలోవున్న తన హేండ్ బ్యాగ్‌లో దాచింది. నర్సు గదిలోంచి లేచింది. భర్త దగ్గరకు వెళ్ళింది.

భర్త— బుసకొడుతూ ఆక్సిజను పీల్చుకుంటున్నాడు. స్మారకం లేదు. పడివున్నాడు. ఎలాఉన్న అవయవాలుఅలాగే పడివున్నాయి. దగ్గరకు వెళ్ళింది. అతని బట్టలు సవరించింది. దుప్పటి కప్పింది.

'తమ్ముడూ, భోజనంచేశావా?... అత్త ఏమీ గొడవ పెట్టలేదుకదా?' అని అడిగింది.

తాను యింటివద్దలేనప్పుడు తమ్ముడు యింటికి వెడితే — మేనత్తతో తగవు తెచ్చుకోవడం ఖాయం! అంతే జరిగింది నాడుకూడా! అనవసరంగా నోరు పారేసుకుంటుందామె. ఎవరుమాత్రం ఎంతకాలం సహించగలరని!

'గొడవ పెట్టకపోవడం కూడానా? నిన్నూ నన్నూ కలిపి వట్టినే తిట్టనారంభించింది. రెండు తందామనిపించిందిస్మీ!' అన్నాడు సూర్యం.

'అలాంటిపని చేశావుకనక!... అప్రదిష్ట!' అన్నది సుశీల.

క్షణాలు గడిచాయి. ఇంకా డాక్టర్ రాలేదు. సుశీల నిరీక్షిస్తున్నది. ఉత్తరం పూర్తి చేయులేదు. మనసు వేగిర పెడుతున్నది. సుదర్శనం రాసిన ఉత్తరాలు ఎప్పుడుమాత్రం ఏకటాకిగా చదవగలిగింది తాను! ఎప్పుడూ బెదురుబ్రతుకే అయింది!

'అక్కా... బావ బ్యాంకులో పనిచేసే శంకర్ మనాసీని ఎరుగుదువుకదూ!' అని అడిగాడు సూర్యం హఠాత్తుగా.

తాను శంకర్‌ని ఎరుగును. ఎర్రగా ఉంటాడు. సుదర్శనం పోలికగా ఉంటాడు. అతన్ని చూస్తే సుదర్శనం జ్ఞాపకం వచ్చేవాడు తనకి. అందుకనే— ఆయన శంకర్‌ని పరిచయం చేసినా, తరచు ఆయనతో తమ యింటికివచ్చినా, తాను మాట్లాడేది కాదు.

'అతనీ ఊరు వచ్చాడక్కా! కనిపించాడు.'

'ఊహూఁ! ఏమన్నాడేమిటి? అని అడిగింది.

'హెడ్ ఎకౌంటెంటు లేదూ ఘుర్మా! వాడు బావకి చెడుపుమాత్రిం వేయించాడట! తాను ఏజంటు కావడానికి బావ అడ్డుగా ఉన్నాడనిట! అన్నాడు సూర్యం.

'ఆఁ! నిజమే!' మ్రాన్పడిపోయింది తాను. 'ఎంత దారుణం! మనిషి గుండె ఎంత వికృతమైన అసహనాల సుడి గుండాల్ని సృష్టించగలదు?' అనుకున్నది మనసులో! ఆశ్చర్యంతో అస్తవ్యస్తమైపోయింది.

'భూతవైద్యుణ్ణి పిలిపించి, పిల్లలకి మంత్రం వేయించాలి కాని, ఆసుపత్రి వైద్యాలవల్ల తగ్గదన్నాడక్కా!'

తానేమీ ఆలోచించలేక పోయింది నిజమేనేమో! అదేం రోగమో డాక్టర్లకంతుపట్టడంలేదాయె! వందలు నీళ్ళలా ఖర్చు కావడమే కాని గుణం కనిపించడంలేదాయె! ఇంతకీ యిది అలాంటిదేదో కాకపోతే, ఈ స్మారకం తప్పిపడివుండడమేమిటి, రోజులు తరబడిగా...అనుకుంది సుశీల.

ఆసుపత్రి ఒక్కసారి నిట్టూర్చి నిటారుగా నిల్చుంది. అవును డాక్టర్‌గారు వస్తున్నారు. కబుర్లు చెప్పుకుంటున్న రోగుల్ని సిస్టర్సు మందలిస్తున్నారు. ఏకాఏకీ విశ్వనాథం మంచం దగ్గరికే వచ్చాడు డాక్టర్. చార్టుచూశారు. స్టెతస్కోపుతో విశ్వనాథం గుండెల్ని పరీక్షించారు 'ఏమమ్మా సుశీలా ఈవేళ తెలివొచ్చిందటగా?' అన్నారు. చార్టుమీద ఏదో వ్రాశారు 'బ్రెయినుకు ఎక్సరే తీయాలమ్మా!' అన్నారు వెళ్ళిపోయారు.

'ఈ రోగం ఏమిటో డాక్టర్లకి అంతుబట్టడం లేదమ్మా!' అన్నది కృప.

ఇంతకీ పిల్లల అదృష్టం ఎలా ఉందో?' అన్నది సుశీల. కనుకొలకుల్లో నీరు నింపుకున్నది. క్షణాలు గడిచాయి. చినుకులు పడుతూనే ఉన్నాయి. హోరుగాలి వీస్తూనే ఉంది.

'అక్కా నువ్వు యింటికి వెళ్ళకూడదూ ?...రాజేశ్వరీ వాళ్ళూ వస్తారేమో!' అన్నాడు సూర్యం.

సుశీల బయలుదేరింది. గొడుగు సాచీ తీసుకుంది. భారంగా కాళ్ళీడ్చుకుంటూ నడుస్తోంది. చినుకుచినుకుగా ముసాబుగా ఉంది. రోడ్డంతా తడిగా బురదగా ఉంది. గుండె బరువుగాడుంది. సుశీల నడుస్తోంది. ఆలోచిస్తోంది. జ్ఞాపకాలు వేధిస్తున్నాయి. సుశీల సరసనే ఎవరో వ్యక్తి నడుస్తున్నాడు. తొందరగా ముందుకు సాగిపోయాడు. వెంటనే ఒక్క సంగతి స్ఫురించిందామెకి!

అబ్బో అది—ఆ రేళ్ళక్రిందటిమాట. తాను పుట్టింటినుంచి వంటరిగా హైదరాబాద్ వస్తున్నది—సుదర్శనాన్ని ట్రెయిన్‌లో కలుసుకోమన్నది. కలుసుకున్నాడు. కలిసి మెలిసి ప్రయాణం చేశారు. తన టిక్కట్టుకూడా సెకండుక్లాసుకు మార్పించేశాడు సుదర్శనం బెజవాడలో దిగాడు. హోటల్లో రూం. ఒక రోజు బేరకు...ఇద్దరూ ఆనాడు కిటకిటలాడుతున్న బెజవాడ వీధుల్లోంచి నడిచారు. ఆ రోజున సుదర్శనం సరసన తాను నడుస్తున్నప్పుడు, లోకమంతా తమనుచూసి దంపతులే అనుకుంటూ మురుస్తూ దీవిస్తున్నప్పుడు తానెంత గర్వంతో పొంగిపోయింది! అవును సుదర్శనం ప్రక్క నించోడమే తనకు గర్వం! తానొక అందాలరాణీలాగున్నది—అతను వేలాదిమందిలో సుందరుడుగా భాసించగల మొనగాడు!

ఆనాటి తన హృదయం బొమ్మకట్టి కనిపించింది తనకి. చిరునవ్వు నవ్వుకుంది సుశీల. ఆనందంతో హృదయం విప్పారు తుంది. ఏమిటో ఈ మనస్సు? అంతట్లోకే ఆనందం, అంతట్లోకే దుఃఖం! సుదర్శనం లేఖ గుర్తుకొచ్చింది. అడుగులు తడబడుతు న్నాయి, చలిగాలికి వెనుబాము కొంకర్లు పోతోంది. నీరసంగా నడుస్తున్నది సుశీల!

ఇంటికి చేరేసరికి, తన పిల్లలదగ్గర తనగురించి చెడామడా తిడుతున్నది అత్తయ్య. ఎందుకో పెద్దపిల్ల రాజేశ్వరి ఏడుస్తు న్నదికూడా! తాను లోపల అడుగుపెట్టేసరికి యింటిపరిస్థితి అసహ్యంగా ఉంది. గట్టిగా సమాధానం చెబుదామనుకున్నది. కాని—తన కోపాన్ని గుండెల్లోంచి బైలుపడకుండా అణచు కొంది. చకచక యింటిపనులు సాగించింది, పిల్లలకి కాఫీ లిచ్చింది. వంటపనులు ముగించింది.

కృపతోటీ, తమ్ముడుతోటీ రాత్రి తానింక రాలేనని చెప్పి వచ్చింది.

చీకటి పడింది. వీధులు విద్యుద్దీపాల కన్నులు తెరచి పోగొట్టుకున్న కాలాన్నీ కాంతినీ వెదుక్కుంటున్నాయి!

'మావయ్య వచ్చేక అంతా ఒక్కసారి భోంచేస్తాంలేవే అమ్మా!' అన్నారు పిల్లలు. పిల్లలు ఎంతో నెమ్మదైనవాళ్ళు. బుద్ధిమంతులు. పనులన్నీ ముగించుకు వచ్చింది. చదువు కొంటున్న పిల్లలదగ్గర కూర్చుని ఆరోజున ఆగష్టు 28వ తేదీ డైయిరీలో యిలా వ్రాసుకుంది:

'హైదరాబాద్‌వచ్చి నేటికి రెండు నెలలయింది, కావలసిన వైద్యమంతా చేయిస్తున్నాం వారికి. కాసులువులేదు డాక్టర్లు ఎప్పటికప్పుడేవో చెప్పడం, చేయడంతప్ప, రోగనిర్ధారణ జరగడంలేదు. ట్రీట్‌మెంటు ఒక ప్లానుప్రకారం సాగడంలేదు. ఇదేం దురదృష్టమో! ఈవేళ యస్. నుంచి ఉత్తరం వచ్చింది. నలభయి రోజులతర్వాత ఇదే! నా రెండు కవర్లూ అందాయట ఇలాంటి అగ్నిపరీక్షలలో నేనిక్కడ వేగిపోతూంటే—అతనికి ఉత్తరం రాయటమే కష్టమైపోతుంది. సరేలే, నా అదృష్టం అలాంటిది! కష్టాలన్నీ కట్టకట్టుకొని ఒక్కసారే వస్తాయి కాబోలు...ఈ సమయంలో అమాయకులైన ఈ పిల్లలు నా కెదురుగా కూర్చుని చదువుకుంటున్నారు. ఏం చదువులో ఏమిటో? బెంగతో కృంగి పోతున్నారు. నన్ను చూసీ, నా ధైర్యంచూసీ గుండెదిట్టవు చేసుకున్నారు. ఏమిటో తెలియదు. నాకు ఓరిమి ఎక్కువై పోతోంది. పిల్లల్ని పల్లెత్తు మాటయినా అనడంలేదు. యస్. లేఖ నన్ను అమితానందపరచింది. గుండెల్లోని గుబులు తీసేసి, బలం చేకూర్చింది. యస్. హృదయం నాకు అమృతం సరఫరా చేసింది కాబోలు!...'

* * *

వారికి జబ్బు ప్రారంభమై సరిగ్గా ఐదు నెలలయింది. అది బాగా ముందువేసవి, మే నెల. గాడ్పులు ఉడికించేస్తున్నాయి. ఒకనాటి సాయంత్రం ఆఫీసునుంచి వచ్చారు.

వస్తూనే కుర్చీలో కూలబడ్డారు. కాఫీ తీసుకువెళ్ళింది తాను. ఒక్కసారి భారంగా నిట్టూర్చారాయన. ముఖం తిప్పుకున్నారు. నెమ్మదిగా కాఫీ పుచ్చుకున్నారు. అంతే! ఒక్క నిముషమైన కాఫీ ఇమడలేదు. వాంతి వచ్చేసింది. కాఫీతో పాటు వమనంలో నెత్తురు! రాత్రికి బాగా జ్వరం వచ్చేసింది. స్మారకం తప్పింది. వెంటనే డాక్టర్ని పిలిపించింది తాను. వేరే దిక్కులేదు, ఒంటరిది. అత్తగారు! తనకు రంపపుకోత పెట్టడానికితప్ప మరే అసరాలేదు. బ్యాంకి మేనేజరుగా ఆయనకి విశ్రాంతి లేకుండా ఒక్కటేపని! తాామున్నది చిన్నఊరు. వైద్యసహాయం పెద్దగాలేదు. ఆఊళ్లో ఒక్కడే ముసలి డాక్టరున్నాడు. ఆయనే పరీక్ష చేశాడు. ఏవో ఇంజెక్షనులిచ్చాడు. రోగమొకటి- వైద్యమొకటి! ఇంత అపసవ్యతా ఆనాటినుంచే ప్రారంభమైంది.

రోహిణికార్తెలో కాన్ని మంటలుపెట్టేస్తోంది. గుండెలు కుతకుతలాడిపోతున్నాయి. ఆరోగ్యంగా ఉన్నవాళ్ళకే స్వస్థత కలగడంలేదు. ఆయన సుస్తీ ఏమిటో తెలియడంలేదు. డాక్టర్ నిర్మొహమాటంగా చెప్పేశాడు; తనకీ రోగమేమిటో అంతుపట్టడంలేదని; ఎక్సరే వగైరాలతో గాని తేలదని; జనరల్ హాస్పిటల్కు తీసుకువెళ్ళాలని...!

ఆవిధంగా ఆ వేసవి తనకు కష్టాలను సంక్రమింపచేసింది. అదేం రోగమో! నాటికీ నేటికీ ఒక్కటే వరస... ఇన్నివేల

యింజెక్షనులూ, ఇన్నిరకాల మందులూ ఏయేట్లో కలుస్తున్నారో తెలీదు. ఏ దుర్వ్యాధి ప్రేరణవల్లనో తెలీదు. ఆ వేసవిలో తన జీవితం బాధల నిదాఘతప్తమై కృశీభూతమవనారంభించింది.

డాక్టర్లెక్కడికి తీసుకుపొమ్మని సలహాయిస్తే అక్కడికల్లా భర్త విశ్వనాధాన్ని తరలిస్తూనేఉంది సుశీల. టి.బి. అనుకున్నారు డాక్టర్లు. శానిటోరియంకు తీసుకు పొమ్మన్నారు. అలాగేచేసింది తాను. కాదు పొమ్మన్నారు. తీసుకువచ్చేసింది. 'మెదడుకు సంబంధించిన వ్యాధి' అన్నారు. మెంటల్ హాస్పిటల్‌కు తీసుకువెళ్ళి జాయినుచేసింది. ఎక్కడికి తీసుకు వెళ్ళినా ఫలితం ఒక్కటే. అదేం రోగమో అంతుచిక్కడమే లేదు! చివరికి. హైదరాబాద్‌లో ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో జాయిన్ చేసింది. అప్పుడే రెండు నెలలయింది. నెలలు మాత్రం గడుస్తున్నాయి.

జూన్ 26వ తేదీ రాత్రి— మరునాడు విశ్వనాధాన్ని హైదరాబాదు తీసుకువెళ్లి జనరల్ హాస్పిటల్‌లో జాయిను చేయాలని నిర్ణయంచేసుకున్న రాత్రి— సుశీల తన డైయిరీలో యిలా వ్రాసుకున్నది—

'లోకానికీ, తల్లిదండ్రుల మర్యాదకీ, నీతికీ జడిసి ఇన్నాళ్లూ కళ్ళుమూసుకుని కాలక్షేపం చేసినందుకు గొప్ప శిక్షే విధించాడు భగవానుడు. ఆయనకీ రోగమేమిటో తెలీదు.

ఏం బాధపడుతున్నారో తెలీదు... ఈ అగ్నిపరీక్షల్ని తట్టుకో లేకపోతున్నాను... నాకయినా చావువస్తే బావుండును... పోనీ మృత్యువేవచ్చి ఈ జీవితాన్ని అంతంచేసి, స్వర్గానికి తీసుకుపోయిందని భావించుకొని, ఈ రోగిష్టిభర్తనీ— కాల్చుకు తినే అత్తగారినీ, నోరెరుగని పిల్లల్నీ అందర్నీ విడిచిపెట్టి— సు. దగ్గరకు పారిపోతే!... అలా పారిపోవడం చావువంటి దవునో కాదో కాని— అతని సాహచర్యంమాత్రం స్వర్గమే ననటానికి నాకెట్టి సందేహమూలేదు... ఏమైతేనేం— ఈ జీవిత పోరాటంలో అలసిపోయాను ఓడిపోయాను. విధి చేతుల్లో కీలుబొమ్మనై —కదిలిస్తే కదులుతున్నాను ఏడిపిస్తే ఏడుస్తు న్నాను. నవ్విస్తే...ఈ బ్రతుక్కి నవ్వుకూడానా ?...అబ్బా! ఈ పోరాటం ఎంతకాలమో ? ఈ ప్రయాణం ఎంతవరకో...'

* * *

చలికాలం ప్రారంభమైంది. సుశీల బ్రతుకులో బరువు మాత్రం తగ్గలేదు. హైదరాబాదు తీసుకువచ్చి నాలుగు నెల లయింది. వైద్యం సాగుతూనేఉంది హాస్పటల్‌నుంచి యింటికీ-యింటినుంచి హాస్పటల్‌కీ సుశీలగడియారంలోని పెండ్యులంలా తిరుగుతూనేఉంది. తమ్ముడు సూర్యం సాదరు ఖర్చులు ఎక్కువ చేస్తున్నాడు. నాన్నగారు అమ్మ, మూడోమారు మళ్ళీ వచ్చారు. హాస్పటల్ సూపర్నెంటుతో నాన్నగారు మాట్లా డారు. ఆయనకి తెలివి తరచుగానే వస్తున్నది. చూపులు తెలి

విగానే ఉంటున్నాయి. కంఠంలోంచి శబ్దాలు వస్తున్నాయి. కాని మాటలుగా పోలిక పట్టడానికి వీలులేకుండా ఉంది. కాని సౌంజ్ఞలు చేస్తున్నారు. కావలసిన వస్తువులడుగుతున్నారు. అదేంరోగమో తెలియదు. ఇంతరోగంగడుస్తున్నదావిశ్వనాథం శుష్కించలేదు. నెల్లాళ్ళయింది. భూతవైద్యుల్ని పిలిపించి చెడుపుమంత్రం తీయించేయడానికి ఏర్పాట్లు చేశారు. వాడు మూడు వందలు పడేసుకుని ఏవో పూజలు వ్రతాలు చేశాడు. అదో పెద్ద నటన. దానివల్లగుణం ఈమాత్రమేనా కనిపిస్తోందన్నారు నాన్నగారు, నాన్నగారిని సూపర్నెంటు పిలిచి, ఇక హాస్పటల్‌లో ఉండనక్కర్లేదు; ఇంటిపద్దనే ఉంచి వైద్యం చేయిస్తే... కాలక్రమేణా అదే తగ్గిపోతుంది' అన్నారు. నాలుగు నెలల తర్వాత విశ్వనాథాన్ని మళ్ళీ యింటికి తరలించారు. ఉన్నయిల్లు చాలదని మరో గదికూడా ఖాళీచేయించి పుచ్చుకున్నారు. కాని అడపా తడపా కృపని కల్సుకోవడం మాత్రం మానలేదు సుశీల. కృప ఎడ్రసుకే తనకు సుదర్శనం నుంచి ఉత్తరాలు వస్తాయి మరి!

చలి తీవ్రమవుతున్నది. నాన్నగారు అమ్మని తనకు సాయంగా వదలి వెళ్ళిపోయారు. తమ్ముడు సూర్యం కూడా వెళ్ళిపోయాడు, ఇప్పుడు మగపనీ ఆడపనీ కూడా తనమీదే పడింది— ఆసుపత్రినుంచి విశ్వనాథాన్ని యింటికి తీసుకువచ్చిన మరునాడు అంటే అక్టోబరు 29వ తేదీని—సుశీల తన డేయిరీలో —ఇలావ్రాసుకున్నది:

'నిన్న మధ్యాహ్నం— మూడు గంటలకు వారిని హాస్పిటల్ నుంచి రిలీజ్ చేసి యింటికి తీసుకువచ్చాం. డాక్టర్ యింటికి వచ్చి చూస్తామన్నారు. ఆయనకి జబ్బు నిమ్మదించిం దనే అనుకుంటున్నారంతా... కాని నాకయితే ఏమాత్రం నమ్మకం కలగడంలేదు. ఇదివరకులా గాక తరచు తెలివి వస్తున్నమాట నిజమే. అంతమాత్రంలో రోగం తగ్గిపోయిం దనడం ఎలా? ఏమయితేనేం— ఆయనమాత్రం మామూలు పరిస్థితికి వస్తారన్న విశ్వాసం నాకెందుకనో కలగడంలేదు. ఇంతకీ ఆ భగవంతుడీ కుటుంబాన్ని ఏం చేయదల్చుకున్నాడో ఏమిటో? సు. నుంచి ఉత్తరంవచ్చి అప్పుడే నెల్లాళ్ళయింది. నాలుగురోజులు క్రితం కృప తనకి డబ్భయి రూపాయలు యం. ఓ. వచ్చిందనిచెప్పి— యాభయి రూపాయలుమాత్రమే నాకిచ్చింది. పోనీ అసలు ఇవ్వకపోయినా తన్ని చేసేదేమీ లేదు. మనియార్డరుకూపను ఇవ్వమంటే— ఎక్కడ పారేశానో జ్ఞాపకం లేదన్నది. ఈలోకమంతా చిత్రం! డబ్బుతప్ప వేరే అభిమానాలే ఈ లోకానికిలేవు. ఎందుకో సు. నాకిలా డబ్బు పంపి అవమానపరుస్తాడు? తనకే మన్యాయం చేశానని! డబ్బు పంపమని ప్రాధేయపడ్డానా?... సాయంత్రం హాస్పి టల్ కు వెళ్ళాను. కృప అప్పుడే డ్యూటీనుంచి దిగిపోయి ఇంటికి పోతూ కనిపించింది. ఆప్యాయంగా పలకరించింది. కౌగలించు కుంది. నేనుమాత్రం మనసులో ఎందుకీ నటన అనుకున్నాను. పాపం! నటనకాదు, సంచిలోంచి యం.ఓ. కూపను, నలభయి

రూపాయలు తీసి ఇవ్వబోయింది. ఏమిటిది? అని అడిగాను. నువ్వు చాలా కష్టంలోవున్నావు సుశీలమ్మా— యిదినీదే— ఇంతకన్నా నేనేం సహాయం చేయగలను! ఇవాళ జీతాలం దాయి మాకు. కాదనకమ్మా!— అంటూ బలవంతంగా నా సంచిలో పెట్టేసింది. రేపింటికి వచ్చి కలుసుకుంటానని చెప్పి, రిక్షా ఎక్కి గబగబా వెళ్ళిపోయింది. కాని నాకేం అర్థం కాలేదు. సంచీలో పెట్టిన డబ్బు లెక్కపెట్టి జాగ్రత్త పెట్టాను. యం.ఓ. కూపను చదివాను. సు. త్వరలో హైదరాబాదు వస్తాడట, తప్పక కృపద్వారా కలుస్తానన్నాడు. అంతదాకా తన్ను క్షమించి ఈ ఎనభై రూపాయలు స్వీకరించమని ప్రాధేయ పడ్డాడు. ఎంత సౌజన్యమూర్తి! కాని కృప మరో పదిరూపా యలు ఎక్కువగా ఎందుకిచ్చిందో?

◆ ◆ ◆

చలి తీవ్రరూపం ధరిస్తోంది. ఉదయం తొమ్మిదిగంటల దాకా సూర్యుడికి వేడెక్కలేదు. మధ్యాహ్నం పన్నెండు గంటలదాకా విశ్వనాథానికి మగత వదలడంలేదు. ఈ చలికీ ఈయన రోగానికీ ఏదైనా సంబంధం ఉన్నదేమో? మాట స్పష్టత ఏర్పడలేదు. కొద్దిగా కళ్ళు తెరచినప్పుడలా ద్రవ పదార్థమే ఆహారంగా తీసుకొంటున్నారు. అన్నీ మంచంమీదే! అందవలసిన జీతం అందడంలేదు. ఆదాయంలేదు. దరిద్రం తలదన్నుతోంది. బ్రతుకు దుస్సహంగా ఉంది. దుర్భరంగా ఉంది. సుశీల రశ్మిలేని జీవితాన్ని మగతగా సాగిస్తోంది.

డిశెంబరు నెల... చలి గజగజ లాడిస్తున్నది. కాలం గడుస్తున్న చిహ్నాలు వాతావరణంలోని మార్పులోమాత్రం గోచరమవుతున్నవి. సుశీల బ్రతుకుమీద బాధల తెర కప్పబడుతోంది. అర్థచేతస్కంగా ఆయుర్దాయం వెచ్చించబడుతోంది. డాక్టర్లు వస్తున్నారు. ఎట్టకేలకు బ్రెయిన్ ఆపరేషన్ చేయాలనుకున్నారు డాక్టర్లు. ఐతే రక్తం తక్కువగా ఉంది. రోగి తట్టుకోలేడన్నారు. కనుక రక్తపుష్టికి మందులూ ఆహారం ఇస్తూ కాలంకోసం నిరీక్షించాలన్నారు.

దేనికోసమో నిరీక్షిస్తూనేవున్నది సుశీల. సుదర్శనం ఎందువల్లనో రాలేదు. ఉత్తరాలు కూడా రావడంలేదు. డ్యూటీ లేనప్పుడు కృప కనిపిస్తూనే ఉన్నది. ఓదార్చుతూనే ఉన్నది. మంచు విపరీతంగా కురుస్తూన్నది. చలి గజగజ లాడిస్తోంది. సుశీల బాగా నీరసపడుతోంది.

జనవరినెల చక్కావచ్చింది. నాలుగురోజుల్నుంచి విశ్వనాథం పరిస్థితి ఎందువల్లనో మరీ దిగజారిపోయింది. డాక్టర్లకు అర్థంకావడంలేదు. 'రాయవెల్లూరు తీసుకువెడితే ఏమైనా సాధ్యమేమోనమ్మా!' అన్నారు డాక్టర్ రామ్మూర్తి తెగించి. అప్పటికే విశ్వనాథం సంపాదనలో మిగుల్చుకున్నదీ వస్తురూపేణా చేర్చుకున్నదీ– అంతా అంగళ్ళపాలయింది. ఎక్కడి సామానులక్కడే దిగవిడిచి హుటాహుటీ ప్రయాణాల పాల్పడ్డారు. రోజులు గడవడానికే బంధువులూ స్నేహితులూ సహాయపడాల్సివస్తూన్నది. నాన్నగారికీ అన్నగారికీ టెలిగ్రాం

లిచ్చింది సుశీల. సుశీల ధైర్యమైనది కనుకనే ఈమాత్రమైనా ఈ అగ్నిసముద్రంలో ఈదులాడుతున్నది. మరొకరైతేనా— ఈపాటికి గుండెఆగి చనిపోయిఉండేది. అమాటే అనుకున్నారు అక్కా బావాను.

చుట్టాలు బిలబిలలాడుతూ వచ్చారు. ఇల్లు సందడిగా ఉంది. కాని రోగికిమాత్రం ఊపిరి సలపడంలేదు. ఎగఊపిరిగా ఉంది. గుండె నెమ్మదిగా కొట్టుకుంటూన్నది. డాక్టర్లు పరీక్షిస్తు న్నారు. ఇంజెక్షనులు యిస్తున్నారు. కాని రోగి తెరపుమరు పుల్లో కొట్టుమిట్లాడుతూనే ఉన్నాడు. ఆవేళ జనవరి ముప్ప య్యవ తేదీ. ఆవేళ ఉదయంనుంచీ విశ్వనాథం పరిస్థితి మరీ విషమించింది.

సుశీల రోగి మంచం దగ్గర్నుంచి కదలలేదు. డాక్టర్ మరోసారి చూశాడు. ఈరోజు గడవడం కష్టమనేశాడు. ఒళ్లు చల్లబడుతోంది. ఎవరికితోచిన సలహా వాళ్ళిస్తూనేఉన్నారు. చేతులకు నూనెరాసుకు కాచమన్నారు నాన్నగారు. సుశీల ఓర్చినంత వేడి చేతులతో భరించి కాస్తూనేఉంది. సరిగ్గా ఐదున్నర గంటలైంది. చలి జోరుహెచ్చించింది. చీకటి పడు తూన్నది. అంతే! విశ్వనాథం ఒక్కసారిగా కళ్ళు తెరిచాడు. ఊపిరి గట్టిగా పీల్చుకున్నాడు. సుశీలను సౌమ్యంగాచూశాడు. అదే ఆఖరిచూపు! అదే ఆఖరి ఊపిరి!

ఆ అసురసంధ్యవేళ పడ్డ చీకటినుంచి ఆ కుటుంబానికి మళ్లీ వెలుగు సోకలేదు.

మర్నాడు... నాన్నగారు, బావ వగైరా బంధువులంతా పదింటికల్లా విశ్వనాథం ఉత్తరక్రియలు ముగించుకొని యింటికి వచ్చారు. సరిగ్గా అదే సమయానికి పక్కగదిలో ఒంటరిగా కూర్చుని సుశీల తన డైయిరీలో...

'జనవరి ముప్ఫయ్యో తేదీ... కాల రాక్షసి దేశానికి తండ్రివంటి మహావ్యక్తిని పన్నెండేళ్ళక్రితం తన పొట్టను పెట్టుకున్నది. నేడు మళ్ళీ నాపిల్లల తండ్రిని మింగేసింది. సుమారు తొమ్మిదినెలల మహావ్యాధితో పాపం విశ్వనాథంబావ నా ఋణం తీర్చుకున్నాడు. తనని నేను ప్రేమించలేదని తెలుసుండీ... నా మనసు అన్యాక్రాంతమై ఉన్నదన్న సత్యం ఎరుగుండీ తన జీవితంలో చాలవరకూ నన్ను సౌమ్యంగానే చూశాడు... నా ప్రేమను ఎలాగైనా చూరగొనాలని జీవితాంతం తాపత్రియపడ్డాడు. విశ్వనాథంబావ ఋషివంటి వాడు. నేనే పిశాచాన్ని... కాని ఈ కసుగందుల భారాన్ని నాకే అప్పగించి నిర్లక్ష్యంగా వెళ్ళిపోయాడు... అవును బ్రతకాలి...తప్పదు మరి!...

—★—

1962 – ఆకాశవాణిలో ప్రసారితము (వాణి సౌజన్యంతో)